సాక్షి
అనకాపల్లి
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



కల్యాణోత్సవాలు ప్రారంభం

విశాఖ: టీటీడీ కల్యాణ మండపంలో శ్రీఐశ్వర్యలక్ష్మీ, సౌభాగ్యలక్ష్మీ, సమేత వల్లభ వేంకటేశ్వర కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి.



తెలుగు సినిమా ఉత్సవం

విశాఖ: తెలుగు తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 92 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు వాతావరణం ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం.బి.జి.ఎస్.కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు 30.1 నుంచి 30.4 డిగ్రీలు, తేమ శాతం 70 నుంచి 73 నమోదవుతాయని, గాలి గంటకు 3 నుంచి 5 కి.మీ.వేగంతో వీస్తుందన్నారు.

స్ఫూర్తిమంత్రం

- సంపద కంటే ప్రేమ గొప్పది
- జీవితంలో అసాధ్యానికి తావులేదు
- ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్



నిక్‌ను సన్మానిస్తున్న ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్



ప్రసంగిస్తున్న నిక్ వుజిసిక్





హాజరైన విద్యార్థులు, (ఇన్‌సెట్) తాను గీసిన నిక్ చిత్రంతో విద్యార్థిని జనని

ఏయూక్యాంపస్: జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవాలి. జీవితం విలువ గుర్తించాలి. జీవితంలో మనం జీవించాలి. సంపద పెంచుకోవడం కంటే ప్రేమను పంచడం ఎంతో విలువైన అంశం అంటూ యువతకు దిశానిర్దేశం చేశారు ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వేదికగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక ప్రసంగం యువతలో కొత్త ఉత్సాహాన్ని, వారిలో నూతన శక్తిని నింపింది. విశ్వనగరంగా మారుతున్న విశాఖలో ఇటువంటి స్ఫూర్తిదాయక ప్రసంగం జరగడం ఇదే తొలిసారి. ఇంతటి మహత్తర కార్యక్రమానికి ఏయూ ఆతిథ్యం అందించి వేదికగా నిలిచింది. వేలాదిమంది విద్యార్థులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త ఉత్సాహంతో వెళ్లారు.

సమయం చూసి నేర్చుకోవాలి

నిక్ ప్రసంగం అంతా సమయ పాలనతో సాగింది. సరిగ్గా సాయంత్రం 6 గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు ఏయూ వీసీ ప్రసంగం, ఇతర కార్యక్రమాలను తిలకించారు. అనంతరం 6.20 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి, సరిగ్గా గంట తరువాత 7.20 గంటలకు తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. తాను చెప్పాలనుకున్న అంశాన్ని సమగ్రంగా, ఎంతో ఆసక్తిదాయకంగా, స్ఫూర్తిమంతంగా యువతకు అందించారు.

ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

హ్యూమన్ బీయింగ్ టు బీయింగ్ హ్యూమన్ అంటూ వేలాది మంది విద్యార్థులు ఏకకాలంలో ప్రతిజ్ఞ చేశారు. అధిక సంఖ్యలో యువత ఒకే వేదిక నుంచి ప్రతిజ్ఞ చేసి ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించారు. దీనిని సంస్థ ప్రతినిధి దిలీప్ పాత్రో వేదికపై ప్రకటించి, ధ్రువపత్రాన్ని ఏయూ అధికారులకు అందించారు.

వసుధైక కుటుంబం ఏయూ

వసుధైక కుటుంబం అనే సూక్తిని నేడు ఏయూ నిజం చేస్తోందని వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూలో చదువుకున్న విద్యార్థులు విశ్వవ్యాప్తంగా స్థిరపడి ప్రపంచానికి సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఏయూను అభివృద్ధి చేసి దేశంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దామన్నారు. సిటీ ఆఫ్ డెస్టినీలో ప్రారంభమైన ఏయూ ఎందరో డెస్టినీని మార్చివేసిందన్నారు.

ఆద్యంతం ఆహ్లాదకరం

యువత కోసం తీర్చిదిద్దిన కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదాన్ని, అణువణువునా స్ఫూర్తిని చాటింది. ముందుగా ఏయూ విద్యార్థిని మిస్ సౌత్ ఇండియా 2022 చరిష్మా తన ప్రసంగంతో యువతను ఆకట్టుకుంది. అనంతరం విభిన్న ప్రతిభావంతుల యువత నృత్య ప్రదర్శనలు, విశాఖ వ్యాలీ విద్యార్థుల నృత్యం, ఏయూ నృత్య, సంగీత విభాగం విద్యార్థుల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, ఏయూ రంగస్థల విభాగం విద్యార్థులు నీరు, వ్యవసాయం విలువను తెలియజేసే మైమ్ ప్రదర్శన, సునీల్ ముప్పుల ప్రసంగం విద్యార్థులను కట్టిపడేశాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నిక్ చిత్రపటానికి పెన్సిల్‌తో తీర్చిదిద్ది ఆయనకు బహూకరించింది. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఏయూ ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అటవీ శాఖకు రూ.5 కోట్ల ఆదాయం

- అటవీ శాఖ సీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి



టేకు దుంగల వేలాన్ని పర్యవేక్షిస్తున్న సీసీఎఫ్

గొలుగొండ: అటవీ శాఖకు ఆదాయం తీసుకురావడం కోసం టేకు, వెదురు అమ్మకాలకు చర్యలు తీసుకుంటున్నామని విశాఖ అటవీ శాఖ రేంజ్ సీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి తెలిపారు. గొలుగొండ కలప డిపోలో మంగళవారం నిర్వహించిన వేలం పాటను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ రేంజ్ పరిధిలో ఇప్పటి వరకు టేకు అమ్మకాల వల్ల రూ.5 కోట్ల మేర ఆదాయం వచ్చిందన్నారు. అటవీ శాఖ పరిధిలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని ప్రాంతాల్లో కలప అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జేఏసీ చైర్మన్ గోపినాథ్‌కు సత్కారం



గోపినాథ్‌ను సత్కరిస్తున్న పీఆర్టీయూ ఉపాధ్యాయులు

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్‌ను యూనియన్ నాయకులు అడిగర్ల వరహాలనాయుడు, జి.వి.రమేష్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోపినాథ్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దుతోపాటు పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు వెంటనే విడుదల చేసేందుకు రాష్ట్ర నాయకత్వం ద్వారా కృషి చేస్తామన్నారు. పీఆర్సీలో భాగంగా ఐఆర్ ప్రకటించే విధంగా చూస్తామన్నారు. నాయకులు శ్రీరామ్మూర్తి, కె.రమణ, ప్రసాద్, అప్పారావు, బాబి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

- ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసు

నర్సీపట్నం: గొలుగొండ మండలం జోగంపేట ఎస్సీ హాస్టల్ వార్డెన్ మద్దు అప్పారావుపై కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సస్పెన్షన్ వేటు వేశారని ఆర్డీవో హెచ్.వి.జయరాం మంగళవారం తెలిపారు. ఇటీవల గిరిజన విద్యార్థి దావీద్‌రాజు(12) విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యలు చేపట్టారు. పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉండటంతో నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలకు, ఏఈ రాజేంద్రకుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశామని ఆర్డీవో తెలిపారు.

అమర్‌కు ఆత్మీయ స్వాగతం



దేవులపల్లి అమర్‌కు స్వాగతం పలుకుతున్న మణిరామ్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో అమర్‌కు సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, రెవెన్యూ అధికారులు ఆత్మీయ స్వాగతం పలికారు. దేవులపల్లి అమర్ విశాఖలో మూడు రోజుల పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అధికార, రాజకీయ ప్రముఖులను కలుసుకుంటారు.

అప్పన్న సన్నిధిలో ఇంగ్లండ్ దేశస్తులు



సింహగిరిపై ఇంగ్లండ్ దేశస్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని మంగళవారం పలువురు ఇంగ్లండ్ దేశస్తులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. సింహగిరి అందాలను తిలకించారు. భక్తులతో కలిసి సందడి చేశారు. భారత్–ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ సందర్భంగా వీరంతా నగరానికి వచ్చారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- ఇంటి పన్నుకు రూ.10 వేల చొప్పున వసూలు
- కొత్త జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖలో మొదటి కేసు





లంచం నగదుతో పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి కనకబాబు, గొలగాం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం గొలగాం గ్రామ పంచాయతీ కార్యదర్శి కోసిరెడ్డి కనకబాబును ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యాలయంలో వల పన్ని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన తోట బాబ్జీ తండ్రి ఇటీవల మరణించాడు. తన తండ్రి పేరున ఇంటి పన్ను.. గ్రౌండ్ ఫ్లోర్‌ను తన పేరున, మొదటి అంతస్తును తన అన్నయ్య పేరున మార్చాలని పంచాయతీ కార్యదర్శిని కోరగా, రూ.10 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు విశాఖపట్నం అవినీతి నిరోధక శాఖ అధికారులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఏసీబీ డీఎస్పీ రమ్య బృందం రంగంలోకి దిగింది. ఉదయం 10 గంటల సమయంలో పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి తన టేబుల్ వద్ద బాబ్జీ నుంచి రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా స్పాట్‌లో పట్టుకుంది. కార్యదర్శి టేబుల్ డ్రాయర్‌లో అనధికార నగదు రూ.10 వేలు స్వాధీనం చేసుకుంది. సాయంత్రం వరకు కార్యాలయంలో విచారణ చేసి ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామని అధికారులు తెలిపారు. కొత్త జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖలో మొదటి కేసు ఇదే అన్నారు.

మరో వ్యక్తిని విచారణ

ఇంటిపన్ను నమోదు కోసం గ్రామానికి చెందిన నీలబాబు స్థానిక పంచాయతీ కార్యాలయానికి రావడంతో ఏసీబీ అధికారులు అనుమానంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో అతడి వద్ద రూ.30 వేలు ఉన్నట్లు రూమర్ రావడంతో కొత్తతలారివానిపాలెం గ్రామస్తురాలు శాంతి అక్కడకు చేరుకుంది. తాను పూర్వకాలంగా ఉన్న సర్వే నంబరు 283లో ప్రభుత్వ భూమిని నీలబాబు కబ్జా చేసి ఇంటిని నిర్మించాడని ఆమె ఆరోపించింది. అతడి వద్ద నగదును స్వాధీనం చేసుకుని విచారణ చేయాలని ఏసీబీ అధికారులను కోరింది. దీనిపై కోర్టులో పిటిషన్ వేశానని, అక్కడ నంబర్ వచ్చే లోపు ఇంటిపన్ను కట్టాలని కార్యదర్శితో ఒప్పందం కుదుర్చుకున్నాడని ఆమె ఆరోపించింది. సాయంత్రం వరకు గదిలోనే ఉంచిన అతడిని విచారణ తర్వాత విడిచిపెట్టారు.

ఉద్యోగం పేరుతో రూ.లక్షల వసూళ్లు

- నిరుద్యోగులకు టోకరా
- పోలీసులకు ఫిర్యాదుతో కదలనున్న డొంక



పోలీసులకు ఫిర్యాదు చేసిన నిరుద్యోగ యువత

చోడవరం రూరల్: ఉద్యోగం కోసం ప్రయత్నించే నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయల మేరకు వసూళ్లు చేసి ఏళ్లు గడిచాక ఎదురు తిరిగారంటూ ఇద్దరు అన్నదమ్ములపై బాధితులు చోడవరంలో పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. చోడవరానికి చెందిన కసిరెడ్డి మోహన్ బాబు, రమణమూర్తి డాక్‌యార్డులో డ్రైవర్, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు చేస్తున్నారు. తమ లాగే రెండు డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగాలు వచ్చేలా చేస్తామంటూ చోడవరానికే చెందిన డోకల మోహనరావు నుంచి 2021 ఆగస్టులో రూ.4 లక్షలు తీసుకున్నారు. అతనితో పాటు మరికొంత మంది నుంచి కూడా ఇదే రీతిలో సొమ్ము వసూలు చేశారు. ఏళ్లు గడిచినా ఉద్యోగం రాకపోయే సరికి తాము ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వాలని కోరితే.. వారు ఎదురు తిరగడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా ఇదే విషయమై బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదీ మోహనరావుతో పాటు బొమ్మిశెట్టి మదన్‌కుమార్, బొబ్బిలి నాయుడు, కొటాన సూర్యప్రకాష్, సకల వంశీ, పి.వెంకటసాయి, కసిరెడ్డి దుర్గారావు మరికొందరి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆడపడుచులకు అండగా ఆసరా... 8లో

జనసేనలో వర్గపోరు

- టికెట్ కోసం రెండు వర్గాలుగా చీలిన నాయకులు
- వారితో మైండ్‌గేమ్ ఆడిస్తున్న టీడీపీ
- గందరగోళంలో పార్టీ కేడర్



మాట్లాడుతున్న శివదత్ వర్గం నాయకులు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గ జనసేనలో వర్గపోరు మొదలయింది. పొత్తులో భాగంగా పాయకరావుపేట టికెట్ జనసేనకు కేటాయించడంతోపాటు అభ్యర్థిగా బోడపాటి శివదత్‌ను ప్రకటించాలని ఆ వర్గం నాయకులు మంగళవారం నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద పత్రికా సమావేశంలో డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆకేటి గోవిందరావు, సహాయ కార్యదర్శి కురందాసు అప్పలరాజు మాట్లాడుతూ.. గత ఆరేడు సంవత్సరాల నుంచి శివదత్ నియోజకవర్గంలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ తరపున అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచారని అన్నారు. ఆయనకు కాకుండా, ఇప్పటికిప్పుడు పార్టీలో చేరి టికెట్ తమకే ఇవ్వాలని కోరే లక్ష్మీ శివకుమారికి తాము మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పారు. మరోపక్క నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి జనసేనలో చేరి టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గెడ్డం బుజ్జి తమ పార్టీ అభ్యర్థిగా లక్ష్మీ శివకుమారిని తెరమీదకు తీసుకురావడంతోపాటు, ఆమెను నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోను కార్యకర్తలకు పరిచయం చేస్తున్నారు. జనసేన పార్టీలో రెండు వర్గాలు తయారైన నేపథ్యంలో దీనిని అవకాశంగా తీసుకుని టీడీపీ ఆ పార్టీలో కుంపటి రాజేసింది. బోడపాటి శివదత్ వర్గాన్ని తమ వైపునకు తిప్పుకున్నారు. ఇస్తే టికెట్ తమకు ఇవ్వాలని, కాని పక్షంలో టీడీపీకి ఇవ్వాలని శివదత్ వర్గం మాట్లాడుతున్నారు. జనసేనలోని రెండు వర్గాలు వేర్వేరు అభ్యర్థులను ప్రతిపాదిస్తే.. ఈ కుమ్ములాటల వల్ల టీడీపీకే టికెట్ కేటాయిస్తారన్న ఎత్తుగడలో భాగంగానే జనసేనలో రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టి వర్గపోరుకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. టీడీపీ ఉచ్చులో చిక్కుకుంటే ఈ దఫా కూడా మళ్లీ జెండా కూలీలుగానే మిగిలిపోవాల్సి వస్తుందని జనసేన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విరాళాల స్వీకరణకు ఆన్‌లైన్ కౌంటర్లు

- సింహగిరిపై తొలివిడతగా మూడు కేంద్రాల్లో తొమ్మిది స్వైపింగ్ యంత్రాలు ఏర్పాటు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై భక్తుల సౌకర్యార్థం స్వైపింగ్ మిషన్లు ద్వారా విరాళాలు స్వీకరించేందుకు ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈమేరకు మంగళవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రాష్ట్ర అధికారి ఉదయ్ గుడిపాటి, ఆ బ్యాంకుకు చెందిన పలువురు అధికారులు, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులతో సమావేశమై చర్చించారు. ఆన్‌లైన్ ద్వారా విరాళాలు స్వీకరించే పద్ధతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు స్వీకరణకు దేవదాయశాఖ కసరత్తు చేస్తోందన్నారు. ఇప్పటివరకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు నుంచి సింహగిరిపై నగదు రూపంలోను, చెక్కులు, డీడీల రూపంలో స్వీకరించేవాళ్లమన్నారు. భక్తులకు మరింతగా సౌలభ్యం చేకూర్చేందుకు స్వైపింగ్ మిషన్‌ల ద్వారా విరాళాలు స్వీకరించేందుకు ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొలివిడతగా అన్నదానం భవనం వద్ద, పీఆర్‌వో కార్యాలయం వద్ద, ఆలయంలోను మూడు చోట్ల తొమ్మిది స్వైపింగ్ మిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా అన్నప్రసాదానికి సంబంధించి శాశ్వత విరాళాలు, స్వల్ప విరాళాలకు సంబంధించి రెండు చోట్ల స్వైపింగ్ మిషన్లు, గో సంరక్షణకు సంబంధించి మరో స్వైపింగ్ మిషన్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయన్నారు. దేవస్థానంతో ఆ యంత్రాలు నేరుగా అనుసంధానమై ఉంటాయని, మూడో పార్టీని ఈప్రక్రియలో అనుమతించబోమని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ యంత్రాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. సింహగిరిపై ఏటీఎమ్ కేంద్రాన్ని కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.



హెచ్‌డీఎఫ్ బ్యాంకు అధికారులతో చర్చిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

ఆర్‌బీకే సేవలు సూపర్

పెందుర్తి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలను ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాల శిక్షణ సిబ్బంది ప్రశంసించారు. అధ్యయనంలో భాగంగా పెందుర్తిలో మంగళవారం వారు పర్యటించారు. ఎయిర్ వైస్ మార్షల్ మనీష్ కుమార్ ఆధ్వర్యంలోని సభ్యులు పెందుర్తి మండలం పినగాడిలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ రైతులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. రైతులతో ముఖాముఖి చర్చలు జరిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషనర్ కార్యాలయ ఉప సంచాలకుడు వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ఉప సంచాలకుడు మోహనరావు, డివిజన్ వ్యవసాయ సహాయక సంచాలకురాలు మాణిక్యంబిక, జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ శిక్షణ కేంద్రం అధికారి సురేష్, మండల వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా చెన్నై సెంట్రల్–భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(06073) స్పెషల్ రైలు చెన్నై సెంట్రల్‌లో సోమవారాల్లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 11.17 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ఈ స్పెషల్ ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ భువనేశ్వర్‌లో మంగళవారాల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 3.42 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 3.44 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 3 గంటలకు చెన్నై సెంట్రల్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఫిబ్రవరి 6 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు నడుస్తుంది.

ఓటమి భయంతో తప్పుడు రాతలు

- స్థానికుల ఓట్లు తొలగించేందుకు కుట్ర
- ఈనాడుపై ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నేతలు



విలేకర్లతో మాట్లాడుతున్న సీహెచ్ నాగాపురం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేతలు

గొలుగొండ: ఓటమి భయంతో టీడీపీ నేతలు సీహెచ్ నాగాపురం గ్రామంలో కుట్ర రాజకీయాలు చేస్తున్నారని సర్పంచ్ యలమంచిలి రఘురాం, వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. మంగళవారం విలేకర్లతో వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఇళ్లు, కుటుంబం, ఆస్తులు ఉండి చాలా సంవత్సరాలుగా ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారిపై కక్ష పూరితంగా ఈనాడు పత్రికలో లేనిపోని తప్పుడు వార్తలు రాయించారని ఆరోపించారు. ఓటమి భయంతోనే సీహెచ్ నాగాపురం గ్రామంలో యర్రా నాగేశ్వరరావు, శ్రీనివాసరావు ఓట్లు తొలగించాలని కుయుక్తులు పన్నుతున్నారని చెప్పారు. యర్రా నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు 50 ఏళ్లుగా అదే గ్రామంలో నివాసం ఉంటున్నట్లు చెప్పారు. ఈ గ్రామంలో ఇళ్లు, కుటుంబం, ఆస్తులు లేకున్నా నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన టీడీపీ సానుభూతిపరులు బొప్పల రాము, జ్యోతి, లక్ష్మి లావణ్య ఇటీవలే ఇక్కడ ఓటర్లుగా నమోదు చేయించుకున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ ఆనందరావును సాక్షి సంప్రదించగా.. దీనిపై విచారణ చేస్తామని తెలిపారు. యర్రా కుటుంబ సభ్యులకు సీహెచ్ నాగాపురంలో ఇళ్లు, ఆస్తులు, కుటుంబం ఉన్నట్లు తెలిసిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు అప్పల రమణ, లంక అప్పారావు, గంట్ల బుచ్చియ్య, యలమంచిలి పెదబాబులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బదిలీ అయిన పోలీసు అధికారులకు సత్కారం



బదిలీపై వెళ్తున్న అధికారులను సత్కరించిన ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి : జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీ, డీఎస్పీ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లను పట్టణ పోలీసు అతిథిగృహంలో మంగళవారం రాత్రి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు అత్యుత్తమంగా వారి సేవలు, సహకారం అందించి, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. నర్సీపట్నం సబ్ డివిజన్ అధికారి అదిరాజ్ సింగ్‌రాణా, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, కోటిబాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీఎస్పీలు వి.సుబ్బరాజు, కె.వి.సత్యనారాయణ, పి.నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ భవ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్టు

నర్సీపట్నం : మైనర్ బాలికను వేధించిన యువకుడిని అరెస్టు చేసినట్టు నర్సీపట్నం రూరల్ ఎస్‌ఐ భీమరాజు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం...అమలాపురం గ్రామానికి చెందిన మైనర్ బాలిక వేములపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. బాలిక సోమవారం కళాశాలకు వచ్చింది. తల్లికి అనారోగ్యంగా ఉందని తెలియడంతో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కళాశాల నుంచి ఇంటికి బయలుదేరింది. ఆటో కోసం వేములపూడి చెక్కల మిల్లు వద్ద బాలిక వేచి ఉంది. అ సమయంలో అమలాపురం గ్రామానికి చెందిన వరుసకు అన్నయ్య అయిన చిందాడ రాజుకుమార్(25) బైక్‌పై బాలికను ఎక్కించుకున్నాడు. కొంతదూరం వెళ్లిన తరువాత బైక్ ఆపి మైనర్ బాలికను జీడిమామిడి తోటల్లోకి తీసుకువెళ్లి లైంగికంగా వేధించాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



కనకం(ఫైల్)

రావికమతం : గుమ్మాళ్లపాడు గ్రామానికి చెందిన పారుపల్లి కనకం(55) పురుగు మందు తాగి మంగళవారం మృతి చెందాడు.రావికమతం ఎస్‌ఐ ధనంజయ్ కథనం మేరకు కనకానికి భార్య, ముగ్గురు కుమార్తెలు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. తీవ్ర మనస్థాపానికి గురైన ఆయన మంగళవారం పురుగుమందు సేవించాడు. కుటుంబీకులు 108లో నర్సీపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



ప్రాంతీయ సదస్సుకు హాజరైన ఆరు జిల్లాల వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట (విశాఖపట్నం): బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, గొండు సీతారాం సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్య, పోలీస్, వైద్య ఆరోగ్య తదితర శాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ‘బాలల హక్కులు, పరిరక్షణ’పై ప్రాంతీయ స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాల కార్మిక కేసులు, ప్రభుత్వం అందిస్తున్న నిధులు, చేపట్టిన చర్యలు, లబ్ధిపొందిన వారి వివరాలపై ఈ సందర్భంగా చైర్మన్ ఆరా తీశారు. ఆరు జిల్లాల్లో రెండేళ్లుగా జరిగిన బాల్య వివాహాల కేసులు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులు, పోక్సో తదితర కేసుల నమోదు, ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై చర్చించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల హక్కుల ఉల్లంఘనలను అడిగి తెలుసుకున్నారు. బాలల హక్కులు, వారి సంక్షేమంపై ప్రభుత్వ శాఖల సహకారం, అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల వివరాలు సేకరించారు. గిరిజన ప్రాంతాల్లోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న భోజనం తీరు తెన్నులపై మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. సదస్సులో చర్చించిన వివిధ అంశాలతో ప్రభుత్వానికి పలు సిఫారసులు చేస్తామన్నారు. చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్,రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రాంతీయ స్థాయి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు క్రైం డీసీపీ వెంకటరత్నం, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కో–ఆర్డినేటర్ జి. తిరుపతిరావు, విశాఖ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్లు, ఆరు జిల్లాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నోరు పారేసుకుంటే పరాభవం తప్పదు

- అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా..
- మాజీ ఎమ్మెల్యే అనితకు వీసం హెచ్చరిక



నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న వీసం

నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై నోరు పారేసుకుంటే ఈసారి తగిన పరాభవం తప్పదని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ మాడుగుల చంద్రబాబు సభకు ప్రజలు రాకపోవడం, వచ్చిన వారు వెళ్లిపోకుండా ఉండడం కోసం అనిత జగన్‌మోహన్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలతోపాటు, ప్రభుత్వంపై ఇష్టం వచ్చిన ట్లు మాట్లాడుతోందన్నారు. ఈ పద్ధతి మార్చుకోవాలన్నారు. అనితపై తాము కూడా వ్యక్తిగత విమర్శలకు దిగితే నియోజకవర్గంలో అడుగు పెట్టే ప్రసక్తి ఉండదన్నారు. ఐదేళ్ల ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో నియోజకవర్గానికి ఏం మేలు చేశావో చెప్పాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు డిగ్రీ కళాశాల, 50 పడకల ఆస్పత్రిలను నెరవేర్చలేదన్నారు. గ్రామంలో కనీసం ఒక్క పంచాయతీ భవనం కూడా కట్టలేకపోయిందన్నారు. అనిత హయాంలో పాఠశాలలు చాలా దారుణంగా మారాయన్నారు. చెట్లకింద, శిథిల భవనాల్లోను ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తరగతులు నిర్వహించే వారన్నారు. ఎవరైనా చనిపోతేనే కొత్త వారికి పింఛను ఇచ్చే వారన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నక్కపల్లిలో డిగ్రీ కళాశాల, 50 పడకల ఆస్పత్రి, పాయకరావుపేటలో కొత్త పీహెచ్‌సీ భవనాలు, నాడు నేడు ద్వారా పాఠశాలల్లో కార్పొరేట్ సదుపాయాలు కల్పించామన్నారు.

దమ్ముంటే ఎవరి హయంలో ఎంత అభివృద్ధి చేశామో వివరించడానికి బహిరంగ చర్చకు రావాలన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, రోడ్లు, డ్రెయినేజీలు ఇంటింటికీ కుళాయిలు, అర్హులైనవారందరికీ పింఛన్లు, అమ్మ ఒడి, రైతులకు పెట్టుబడి సాయం, డ్వాక్రా రుణమాఫీ అమలు చేశామన్నారు. ఇకనైనా టికెట్ కోసం చౌక బారు దిగజారుడు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

బల్క్‌డ్రగ్స్‌పార్క్ ఏర్పాటుతో వేలాది మందికి ఉపాధి

- పాయకరావుపేటకు పారిశ్రామిక శోభ
- ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వైఎస్ విగ్రహం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీసం తదితరులు

నక్కపల్లి : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషితో పాయకరావుపేట నియోజకవర్గం రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని, ఏపి పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నక్కపల్లి క్లస్టర్‌లో సేకరించిన భూముల్లో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం రెండు వేల ఎకరాలు కేటాయించడంతో పాటు, ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పన కోసం త్వరలో వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనుందని తెలిపారు. ఇందుకు కృతజ్ఞతగా మంగళవారం నక్కపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, వాడుకనీరు ఇతర మౌలిక సదుపాయల కల్పనకు ఏపీఐఐసీ ద్వారా నిధులు మంజూరు చేసి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అలాగే మత్స్యకారుల కోసం రూ.24 కోట్ల వ్యయంతో ఫిష్ ల్యాండింగ్ సెంటరుకూడా మంజూరు చేశారన్నారు. స్థల సేకరణ పూర్తయితే జెట్టీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటై పలు పరిశ్రమలు వస్తే ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తిగా జగనన్న నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, సురేష్ వర్మ, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందు, పార్టీ నాయకుడు అల్లాడ కొండ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



ప్రజావేదికలో విచారణ చేస్తున్న జిల్లా అధికారులు

కోటవురట్ల : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గుర్తించిన అక్రమాలపై చర్యలు తప్పవని అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ రోజారమణికుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో గత నెల 18 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక తయారు చేసింది. తనిఖీలలో గుర్తించిన అంశాలను ప్రజావేదికలో అధికారులకు వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా 847 పనులు నిర్వహించగా వేతనాల రూపంలో రూ.10.52 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.3.23 కోట్లు ఖర్చు చేశారు. డీఆర్పీలు ఈ పనులకు సంబంధించిన అవకతవకలను ప్రజావేదికలో వివరించారు. అడిషినల్ పీడీ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడంలో కృషి చేయాలని అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరి నుంచి రికవరీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్సు అధికారిణి నిర్మలాదేవి, ఎస్‌ఆర్పీ రామారావు, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ, ఏపీవో గంగునాయుడు, ఉపాధి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంఈవో–2 సంఘం అధ్యక్షుడిగా మూర్తి



జిల్లా ఎంఈవో–2ల సంఘం కమిటీ

అనకాపల్లి : జిల్లా విద్యాశాఖ ఎంఈవో–2ల సంఘం అధ్యక్షునిగా పి.ఎస్.ఎన్.మూర్తి(మాకవరపాలెం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జీవీఎంసీ పట్టణ బాలికొన్నత హైస్కూల్ ఆవరణలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా బి.విశ్వేశ్వరరావు(బుచ్చియ్యపేట), కోశాధికారిగా బి.ఎ స్.శివనాయుడు(మునగపాక), గౌరవాధ్యక్షునిగా బీఎస్ఎన్.మూర్తి(సబ్బవరం)తో పాటు ఇద్దరు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ ఎంఈవో–2లకు సమాన హోదా కల్పించాలని, జాబ్‌చార్ట్‌లో మార్పులు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి ఎంఈవో–2 పోస్టులను క్రియేట్ చేసి, విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు.

వందేభారత్‌కు సామర్లకోట హాల్ట్ కొనసాగింపు

తాటిచెట్లపాలెం: విశాఖ–సికింద్రాబాద్–విశాఖ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఇటీవల తాత్కాలికంగా సామర్లకోటలో హాల్ట్ కల్పించారు. ఇరు వైపులా ఈ రైలుకు సామర్లకోట హాల్ట్‌కు మరి కొంత కాలం పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఆడపడుచులకు అండగా ఆసరా...



ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మానిఫెస్టోనే మాయం చేసిన ఘనత గత ప్రభుత్వానిదైతే, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుని ఆడపడుచులకు ఆర్థిక స్వావలంబన కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది. మహిళా సాధికారతే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ఎందరో మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు.

ఆసరా సొమ్ముతో చికెన్ దుకాణం



చికెన్ దుకాణంలో ఈశ్వరమ్మ

దేవరాపల్లి : నిరుపేద కల్లుగీత కార్మిక కుటుంబానికి చెందిన కక్కల ఈశ్వరమ్మ ప్రభుత్వ తోడ్పాటుతో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆమె భర్త సుమారు 16 ఏళ్ల క్రితం మరణించడంతో ఆమె ముగ్గు విక్రయిస్తూ అప్పటికి చిన్నపిల్లలుగా ఉన్న ముగ్గురు కుమార్తెలను వ్యయ ప్రయాసల నడుమ పెంచి పెద్ద చేసింది. ప్రైవేటు వ్యాపారుల దగ్గర అప్పులు తీసుకొని పిల్లలకు అతి కష్టం మీద పెళ్లిళ్లు చేసింది. నిరుపేదరాలైన ఆమెకు గత ప్రభుత్వంలో ఎటువంటి సహాయం అందలేదు. దీంతో ఒక పక్క కుటుంబ పోషణకు తీవ్ర ఆర్థికపరమైన ఇబ్బందులు, మరో పక్క అప్పుల బాధ పీడించేవి. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఆమెకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా కలిగింది. ప్రతి నెలా వితంతు ఫించన్ సొమ్ము రూ.3 వేలు అందుతుంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలు కలిపి రూ.25,200 లబ్ధి కలిగింది. చేయూత పథకం ద్వారా ఇప్పటి వరకు మూడు విడతల్లో 18,750 చొప్పున రూ.56,250 అందించారు. అలాగే బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.75 వేలు, స్త్రీనిధి ద్వారా రూ.50 వేలు రుణం మంజూరైంది. ఈ సొమ్ముతో కొంత మేర అప్పులు తీర్చి మిగిలిన సొమ్ముతో చికెన్ దుకాణం పెట్టుకొని ఉపాధి పొందుతోంది. గతంలో రోజంతా మండుటెండలో ప్రతి ఇంటికి వెళ్లి ముగ్గు అమ్మినా వచ్చే ఆదాయం ఏమాత్రం సరిపోక ఇబ్బందులు పడ్డానని, సీఎం జగన్ అందించిన ఆర్థిక సహకారంతో చికెన్ షాపు నిర్వహణతో ఆర్థిక ఇబ్బందులు తొలిగాయని, కూతుళ్ల బాగోగులు చూసుకోలుగుతున్నానని ఆమె తెలిపింది.

రుణమాఫీ...హోటల్ పెట్టేలా చేసింది..



మునగపాకలో హోటల్ నిర్వహిస్తున్న మణి

మునగపాక : మునగపాక గ్రామానికి చెందిన మళ్ల మణి స్థానికంగా నూకాంబిక టిఫిన్ అండ్ మీల్స్ పేరిట హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. తన భర్త సూరిబాబు నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మణి మునగపాకలోని సాంబశివ డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా పది మందితో కలిసి చేరారు. మునగపాక ఎస్‌బీఐ ద్వారా సంఘ సభ్యులంతా తమ అవసరాలకు రూ.7లక్షల 50వేలను రుణంగా తీసుకున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక హామీలో భాగంగా నాలుగేళ్లకు సంఘం మొత్తానికి రూ.6,70,288 నగదు మాఫీ అయింది. తన వంతుగా మణికి నాలుగేళ్లలో రూ.67,028 రుణ మాఫీ జరిగింది. ప్రభుత్వం ద్వారా అందిన సాయంతో స్థానికంగా హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధి సాగిస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన రుణమాఫీ తనకు మేలు చేకూర్చిందంటూ ఆమె హర్షం వ్యక్తం చేసింది.

దర్జీ వృత్తికి సంక్షేమ దర్జా...



తుమ్మపాల: అర్జా లక్ష్మి, ఆమె భర్త రామారావుకు దర్జీ వృత్తి జీవనాధారం. వారికి ఒక కూతురు ఉంది. దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామంలో ఉంటున్నారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు స్వయం సహాయక సంఘం సభ్యులకు రుణమాఫీగా 'వైఎస్సార్ ఆసరా' అందించడంతో ఆమెకు ఏడాదికి రూ.10,700 చొప్పున 4 విడతలకు రూ.42,800 లబ్ధి కలిగింది. సచివాలయంలో ఆమె కుమార్తెకు ఏఎన్ఎంగా ఉద్యోగం వచ్చింది. ఇటీవలే వివాహం కూడా చేశారు. అంతేకాకుండా వైస్సార్ సున్నా వడ్డీ పథకం ఏడాదికి రూ.1,000, 'వైస్సార్ చేయూత' ఏడాదికి రూ.18,750 కూడా ఆమెకు అందింది. దీనికి తోడు పింఛను రూ.3000 చొప్పున ఏడాదికి రూ.36,000, టైలరింగ్ వృత్తికి ఏడాదికి రూ.10,000 చొప్పున సంక్షేమ లబ్ధి చేకూరింది. చాలీచాలని ఆదాయంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమకు జగనన్న ప్రభుత్వంలో అన్ని సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందుతున్నాయని, నవరత్న పథకాలతో తమలాంటి బడుగువర్గాల వారికి జీవనోపాధికి భరోసా ఇస్తున్న జగనన్న ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటామని లక్ష్మి తెలిపారు.

స్కూల్ నుంచి యువకుడితో బయటకు వెళ్లిన విద్యార్థిని

- ప్రిన్సిపాల్‌ని నిలదీసిన విద్యార్థిని బంధువులు



ఆందోళన చేస్తున్న వారికి సర్ది చెబుతున్న ఎస్‌ఐ భీమరాజు

నర్సీపట్నం : స్కూల్‌కు వచ్చిన విద్యార్థిని యువకుడితో బయటకు వెళ్తుంటే మీరేమి చేస్తున్నారంటూ విద్యార్థిని తల్లిదండ్రులు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యా రాణి, ఉపాధ్యాయులను నిలదీశారు. వేములపూడి గ్రామానికి చెందిన మైనర్ బాలిక మోడల్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతుంది. అదే గ్రామానికి చెందిన యువకుడి తల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌లో వర్కర్‌గా పని చేస్తోంది. తల్లి దగ్గరకు వస్తున్న క్రమంలో యువకుడికి మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. బాలిక స్కూల్‌కు వచ్చి పుస్తకాల బ్యాగ్ స్కూల్లో విడిచి పెట్టి ఆ యువకుడితో కారులో వెళ్లింది. తిరిగి స్కూల్ విడిచిపెట్టే సమయానికి బాలిక స్కూల్‌కు వచ్చి పుస్తకాలు తీసుకుని అందరు విద్యార్థులతో కలిసి ఇంటికి వెళుతోంది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు మంగళవారం వెళ్లి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పాఠశాల గేటుకు తాళం వేసి ఆందోళన చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ భీమరాజు సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ విషయంపై తనకు ఫిర్యాదు రాలేదని, ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తానని ఎస్‌ఐ తెలిపారు. కాగా విద్యార్థిని శనివారం ఉదయం స్కూల్‌కు వచ్చి జెరాక్స్ కాపీలకు అని 8.30 గంటల సమయంలో బయటకు వెళ్లిపోయిందని తోటి విద్యార్థులు చెప్పగా, తల్లిదండ్రులకు ఫోన్‌లో విషయం తెలియజేశానని ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. తోటి విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో ఆ యువకుడి నంబర్ సేకరించి నీకోసం పోలీసులు వస్తున్నారని చెప్పడంతో అతను విద్యార్థినిని స్కూల్‌కు తీసుకువచ్చాడని, వెంటనే అమ్మాయిని తల్లిదండ్రులకు అప్పగించానని తెలిపారు. అయితే సోమవారం ఆ విద్యార్థిని స్కూల్‌కు రాలేదని, మంగళవారం తల్లిదండ్రులు వచ్చి స్కూలు గేటుకు తాళం వేసి హడావుడి చేయడంతో ఎస్‌ఐకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఎస్‌ఐ వచ్చి విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారని ప్రిన్సిపాల్ తెలిపారు.

అక్రమ మద్యంతో ఇద్దరు అరెస్టు



పట్టుబడ్డ అక్రమ మద్యం

చోడవరం రూరల్: మండంలోని గవరవరం, పట్టణంలోని పీఎస్‌పేట రోడ్డులలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. వీరి వద్ద నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. మంగళవారం తమకు ముందస్తుగా అందిన సమాచారంతో గవరవరం గ్రామంలో ఆంజనేయస్వామి గుడి సమీపంలోని ఆదుర్తి సోమరాజు పాన్‌షాపులో తనిఖీ చేసి ఎటువంటి లైసెన్సు లేకుండా 13 మద్యం సీసాలు కలిగి ఉన్నందున సోమరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. పట్టణ పరిధిలోని పీఎస్‌పేట రోడ్డులో ఆటోస్టాండ్ వద్ద బెన్నవోలు గ్రామానికి చెందిన శానాపతి రమణ వద్ద 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పరిమితికి మించి మద్యం సీసాలు కలిగి ఉన్నా, అక్రమంగా అమ్మకాలు సాగిస్తున్నా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

క్యాన్సర్ రోగికి పింఛను పంపిణీ



విశాఖపట్నం ఆస్పత్రిలో యంపాడ దేముడమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ పోతురాజు, ఎంపీటీసీ కృష్ణమూర్తి

దేవరాపల్లి: క్యాన్సర్‌తో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్న వృద్ధురాలికి సోమవారం రాత్రి పింఛను అందజేసి మానవత్వం చాటారు. దేవరాపల్లి గ్రామానికి చెందిన యంపాడ దేముడమ్మ విశాఖలో క్యాన్సర్‌కు చికిత్స పొందుతుండగా పింఛను పంపిణీకి సోమవారం ఆఖరి రోజు కావడంతో స్థానిక ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి సహకారంతో వలంటీర్ అనిమిరెడ్డి పోతురాజు రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆస్పత్రికి చేరుకొని పింఛను సొమ్మును అందజేశారు. వలంటీర్‌తో పాటు సహకరించిన ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తిని పలువురు అభినందించారు.

భూమి నమోదు కోసం రైతు ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గోవిందరావు

నాతవరం : ఆన్‌లైన్‌లో తమ భూమి మాయం చేశారంటూ రైతు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగాడు. మండలంలో ఎ.పి.పురం గ్రామానికి చెందిన పోలుపర్తి గోవిందరావుకు అదే గ్రామంలో సర్వే నంబర్లు 169, 209లో వారసత్వంగా వచ్చే భూమి ఉందన్నారు. ఆయన ఆ భూమిలోను సాగు చేసుకుంటున్నారు. 2022 సంవత్సరం వరకు రికార్డులో తన పేరు మీద ఆన్‌లైన్‌లో భూమి ఉండేదన్నారు. తర్వాత నుంచి తన పేరు మీద భూమి ఆన్‌లైన్‌లో కనిపించలేదని, దీనిపై అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేదన్నారు. దీంతో విసుగు చెంది ఆందోళనకు దిగాన న్నారు. ఆందోళన చేస్తున్న గోవిందరావు వద్ద రెవెన్యూ అధికారులు వెళ్లి మీ సమస్యను నిబంధనల ప్రకారం పరిష్కారం చేస్తానని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

అనకాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం నిర్వహించనున్నట్లు జీవీఎంసీ ఏపీడీ వి.కె.దొర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వేల్పులవీధి సచివాలయం -7 పరిధి గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో నిర్వహించే ఈ శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులతో పాటు ఒక ఫ్యామిలీ డాక్టర్, కంటి వైద్యుడు, వైద్య సిబ్బంది పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఉచితంగా వైద్య, రక్త పరీక్షలు, మందులు అందజేస్తారన్నారు.

9న రక్తదాన శిబిరం

అనకాపల్లి : ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా డీపీటీ కార్యాలయం ఆవరణలో ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డీపీటీ అధికారి కె.పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేస్తారని ఆమె తెలిపారు. స్వచ్ఛందంగా ఏవరైనా ఆరోగ్యవంతులైన యువతీ యువకులు రక్తదానం చేయొచ్చని ఆమె తెలిపారు.

ఏడుగురికి కంటి శస్త్ర చికిత్సలు


రోగులతో రోటరీ సిబ్బంది

అనకాపల్లి : స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఏడుగురికి కంటి శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆస్పత్రి చైర్మన్ పీజే నాయుడు తెలిపారు. సోమవారం 36 మందికి పరీక్షలు చేయగా ఏడుగురు ఆపరేషన్లకు ఎంపిక కావడంతో వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి ఐదు రోజులకు సరిపడా మందులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, ఆస్పత్రి మాజీ చైర్మన్ రవి రామ్ జవహర్, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కశింకోట : శివారులోని కొబ్బరి తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కె. రమేష్ బాబు తెలిపారు. స్థానికులైన సిదిరెడ్డి రామకృష్ణ, బొబ్బరి నాగరాజు, పట్నాల అప్పారావు, బోడ అప్పన్న, బొబ్బిలి గణేష్ పేకాట ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.750 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,242 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,810	4,740
మొదటి రకం	3,570	4,060
రెండో రకం	3,510	3,700
మూడోరకం	3,180	3,540

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	రాజా
అంబాజీపేట మ్యారేజిబ్యాండు	సత్యనారాయణస్క్రీన్-1
బూట్‌కట్ బాలరాజు	సత్యనారాయణస్క్రీన్-2
కెమెరామ్యాన్ గంగతో రాంబాబు	షిర్డీసాయి
ధీర	పర్తిసాయి
దళారి	వెంకటేశ్వర
నా సామిరంగ	శ్రీసత్య
హనుమాన్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 63 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఎ నెగెటివ్-1 యూనిట్, ఓ నెగెటివ్-1 యూనిట్, ఏబీ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అందాల మందారం..

మున్సిపాలిటీగా ఉన్నప్పటి కంటే అనకాపల్లి పట్టణం ఇప్పుడు మరింత వేగంగా అభివృద్ధి చెందుతోంది. సీఎం జగన్ ఆదేశాలతో అధికారులు అనకాపల్లి పట్టణాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, డివైడర్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో గతంలో పట్టణానికి ఇప్పటి పట్టణానికి తేడా కొట్టొచ్చినట్లు తెలుస్తోంది. సుందరంగా మారుతున్న పట్టణాన్ని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


సుంకరమెట్ట జంక్షన్ డివైడర్ మధ్య మొక్కలు


జలగల మదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట రహదారి

- కనువిందుగా పట్టణ రూపురేఖలు
- రూ.18 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు, డివైడర్లు, విద్యుత్ లైట్ల ఏర్పాటు
- రూ.24 లక్షలతో మొక్కల పెంపకం
- మౌలిక సదుపాయాల ఏర్పాటుతో జిల్లా కేంద్రానికి నూతన అందాలు



అనకాపల్లి : అనకాపల్లి పట్టణ ముఖద్వారం రూపురేఖలు దశల వారీగా మారుతున్నాయి. జీవీఎంసీలో విలీనమైన తర్వాత ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. టీడీపీ పాలనలో విశాఖ, పూడిమడక జాతీయ రహదారి మీదుగా అనకాపల్లి పట్టణానికి రావాలంటే వాహన చోదకులు, ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని నెహ్రూ చౌక్‌కు వచ్చేవారు. నేడు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పై రెండు రహదారులపై సునాయాశంగా ప్రయాణం చేయగలుగుతున్నారు.

రహదారుల అభివృద్ధి..
జోన్ పరిధిలో సుమారు **రూ.18 కోట్ల నిధులతో** పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రహదారుల విస్తరణ, కొత్త రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి విద్యుత్ లైట్ల వంటి అనేక మౌలిక సదుపాయాలు కల్పించారు.

పర్యావరణ పరిరక్షణకు..
రూ.24 లక్షలతో మొక్కల పెంపకం చేపట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం నడుం బిగించింది. జీవీఎంసీ హార్టీ కల్చర్ ఉద్యోగులు జోన్ పరిధిలో సుమారు 6 కిలోమీటర్ల రహదారుల్లోని డివైడర్ల మధ్యలో బోగస్ మిలియన్, మిర్చియా మేరిగ్రీస్ వంటి సుమారు 2 లక్షల మొక్కలు నాటారు. **జాతీయ రహదారి సుంకరమెట్ట** జంక్షన్ నుంచి **శారదా బ్రిడ్జి, నెహ్రూ చౌక్ నుంచి** గుండాల జంక్షన్ వరకూ డివైడర్ మధ్యలో మొక్కలు నాటుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాటిన మొక్కలు ఇప్పటికే చిగురించడంతో అటుగా ప్రయాణించే ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిగ్‌జాగ్ రంగులు..
డివైడర్లకు ఇరువైపులా తెలుపు, నలుపు రంగులు వేయడంతో రాత్రి సమయంలో అటుగా ప్రయాణించే వారు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో నివసించే పట్టణ వాసులు ఈ ఏడాది సంక్రాంతి పండగకు విచ్చేసి ఇక్కడ జరిగిన అభివృద్ధిని చూసి అవాక్కవుతున్నారు.

వాహన చోదకుల కష్టాలు తీరాయి..



జాతీయ రహదారుల నుంచి పట్టణానికి రావాలంటే పెద్ద పెద్ద గోతుల వల్ల ఇబ్బందులు తప్పేవి కాదు. వాహనాలు కూడా మరమ్మతులకు గురయ్యేవి. జలగల మదుం మృత్యుదారిగా ఉండేది. అటువంటి దాన్ని నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసి, విద్యుత్ లైట్లు అమర్చారు. దీంతో వాహన చోదకులకు వీలుగా ఉంది.

– ఎం.కృష్ణ, అనకాపల్లి.

మారిన రూపురేఖలతో ఆశ్చర్యపోయా..



ప్రతి ఏడాది సంక్రాంతికి అనకాపల్లిలోని అత్తవారింటికి కుటుంబ సమేతంగా వస్తాం. గత ఏడాదికి ఇప్పటికీ పట్టణంలో రహదారులు, పర్యావరణం, కొత్త విద్యుత్ లైట్లు చూసి ఆశ్చర్యపోయాం. ఈ అభివృద్ధితో పట్టణం ఎంతో మారిపోయింది. పెరుగుబజార్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయడం ఆనందం కలిగించింది.

– కె.అజయ్, హైదరాబాద్.

రూ.24 లక్షలతో డివైడర్ల మధ్య మొక్కల అభివృద్ధి



డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి వాటిని పర్యవేక్షిస్తున్నాం. స్థానికులు మొక్కలను కాపాడుకునే బాధ్యత తీసుకోవాలి. సుమారు 6 కిలోమీటర్ల పొడవున వేసిన మొక్కలకు ఉదయం వేళల్లో నీటిని అందిస్తున్నాం. ఎక్కడైనా మొక్కలు చనిపోయినట్లయితే మా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే కొత్త మొక్కలు నాటుతాం.

– దామోదరరావు,
జీవీఎంసీ హార్టీకల్చర్ అధికారి, విశాఖపట్నం

‘జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం’


సీఎం జగన్ చిత్రానికి క్షీరాభిషేకం చేస్తున్న భరత్‌కుమార్, నాయకులు

- అక్కచెల్లెమ్మలు సంపూర్ణ మద్దతు తెలపాలి
- పార్టీ సమన్వయకర్త భరత్‌కుమార్


భారీగా సభకు హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు


స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న మలసాల భరత్‌కుమార్

కశింకోట : మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి మహిళామణులు సంపూర్ణ మద్దతు అందించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సభను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న పథకాలన్నీ యథావిధిగా అమలు కావాలంటే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర నాయకుల మాయ మాటలు విని మోసపోవద్దన్నారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీలా గోవింద సత్యనారాయణ వంటి స్థానికేతరులను గెలిపించారని, వీరి వల్ల నియోజకవర్గానికి ఒరిగిందేమి లేదన్నారు. రాజకీయ కుటుంబానికి చెందిన స్థానికుడను, మండలానికి చెందిన తనకు ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆశీస్సులతో ఈసారి పోటీ చేయడానికి అవకాశం వచ్చిందన్నారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వాటర్ వేస్ అథారిటీ సంస్థ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా పేరిట స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణ మాఫీ చేసి మాట నిలుపుకున్నారన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్ మాట ఇచ్చారంటే అది అమలు జరిగి తీరుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ మండలంలో 1537 సంఘాలకు సుమారు రూ. 53 కోట్ల మేర రుణ మాఫీ చేశారన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..
వైఎస్సార్ ఆసరా పథకం కింద స్వయం సహాయక సంఘాలకు రుణ మాఫీ చేసినందుకు కృతజ్ఞతగా మహిళలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణ మాఫీ సొమ్ము రూ.13 కోట్ల చెక్కును భరత్‌కుమార్ అందజేశారు. ముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి స్టాళ్లను భరత్‌కుమార్ పరిశీలించి అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ కె. విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీడీవో శేషుబాబు, ఈవోఆర్డీ సోమరాజ్, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్ష.. జగనన్న సురక్ష


రోగికి మందులు అందజేస్తున్న దిలీప్‌కుమార్, సూరిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

అనకాపల్లి : కుటుంబంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలనే దృఢ సంకల్పంతో గ్రామీణ స్థాయి నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ పరిధిలో జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. విద్య, వైద్యం రెండు నేత్రాలుగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. సురక్ష మొదటి దశలో కోట్లాది మంది రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందించారని, రోగుల నుంచి మంచి స్పందన రావడంతో రెండో విడత కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు రోగాల బారిన పడినప్పుడు టీడీపీ పాలనలో కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టేవారన్నారు. సీఎం జగన్ పాలనలో వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి, స్పెషలిస్టు వైద్యుల ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. శిబిరంలో 314 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 8 మంది రోగులను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, 14 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఏసీడీపీవో శశికళ, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పార్టీ మండల పాధ్యక్షుడు విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, వద్దాది అశోక్ భారతి, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, రోగులు పాల్గొన్నారు.

ఘనంగా బండారమ్మ తీర్థం



కశింకోట : మండలంలోని తేగాడలో బండారమ్మ తల్లి తీర్థ మహోత్సవం మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని పూల మాలలు, నిమ్మకాయల దండలు, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థంలో తిను బండారాలు, ఆట వస్తువులు, అలంకరణ వస్తువుల విక్రయాలు సాగాయి.

9న మరిడిమాంబ సారె ఊరేగింపు

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 9వ తేదీన అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ అన్నారు. ఆలయ ఆవరణలో సారె ఊరేగింపు గోడపత్రికలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ ఏడాది మాదిరిగానే పట్టణంలో పురవీధులు గుండా అమ్మవారి సారె ఊరేగింపు జరుగుతుందన్నారు. వివిధ రకాలైన పిండివంటకాలు మహిళలు తయారుచేసి ఊరేగింపులో పాల్గొని, అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, భక్తులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి పలకా రాము, వైస్ చైర్మన్ బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పిట్టల బుడ్డీసు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు


నిర్మాణ దశలో క్రిటికల్ కేర్ యూనిట్

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా ప్రభుత్వ స్థలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆదేశాల మేరకు 50 పడకల ఐసీయూ (క్రిటికల్ కేర్ బ్లాక్) నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎంపీ బీవీ సత్యవతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.22.5 కోట్ల నిధులతో 50 పడకల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ రోగులకు మరో నాలుగు మాసాల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. యూనిట్‌లో ట్రామా కేర్ సెంటర్, డయాలసిస్ యూనిట్ రోగులకు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. అత్యవసర వైద్యసేవలు జిల్లాలో మారుమూల ప్రాంత ప్రజలకు కూడా అందుబాటులో ఉంటాయని, విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయాల్సిన ఉండదని తెలిపారు.

ఆకట్టుకున్న ‘ఆసరా’ మహిళల స్టాళ్లు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్, వెజ్, నాన్ వెజ్ పచ్చళ్ల ప్రదర్శన స్టాల్

కశింకోట : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పలు రకాల స్టాళ్లు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ ఆసరా ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తమకు అందజేసిన రుణమాఫీ నగదుతో స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకొని ఉపాధి పొందుతున్నారు. దీనిలో భాగంగా కశింకోటలోని అఫీషియల్ కాలనీకి చెందిన గాంధీ స్వయం సహాయక సంఘం తరపున లక్ష్మి ఆధ్వర్యంలో రూపొందించిన పలు ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. పత్తితో రూపొందించిన తోరణాలు, డోర్, ఫ్రిజ్ కర్టెన్లు, పశువుల అలంకరణ అల్లికలు, పూజకు ఉపయోగించే వత్తుల తయారీ మొదలైన వాటిని విక్రయించి కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇక బయ్యవరం గ్రామంలో చీరలు, వస్త్రాల విక్రయాన్ని పప్పల రమణమ్మ, దాసరి ఆదిలక్ష్మి చేపట్టారు. స్థానికంగా విక్రయించడంతో పాటు గ్రామ వీధుల్లో తిప్పి అమ్మకాలు సాగిస్తూ ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎంఎఫ్ఎంఈ ద్వారా వచ్చిన రూ.3 లక్షల రుణంతో అల్లం, నిమ్మ, మామిడి తదితర వెజిటేరియన్, చికెన్, రొయ్య వంటి నాన్ వెజ్ నిల్వ పచ్చళ్లను తయారు చేసి విక్రయిస్తూ స్థానిక కోట వీధికి చెందిన నరాలశెట్టి సత్యవతి ఉపాధి పొందుతున్నారు. ఈ మేరకు స్టాల్ ఏర్పాటు చేశారు. ఇక ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల ఉత్పత్తులను ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి కూండ్రపు అరుణ ఆధ్వర్యంలో రైతులు ప్రదర్శించారు. టమాటా, చిక్కుడు, ఉల్లి పరకలు, తాటి తేగలు తదితర ఉత్పత్తులతో పాటు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తదితర వాటిని ఈ సందర్భంగా ప్రదర్శించారు. వీటిని సంబరాలకు వచ్చిన మహిళలు, స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆసక్తిగా తిలకించారు.



వస్త్ర ఉత్పత్తుల ప్రదర్శన, ఇంటి అలంకరణ తోరణాల స్టాల్

గ్రామ సచివాలయాల్లో పారదర్శకంగా సేవలు


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్డీవో ఉదయశ్రీ

నాతవరం: ప్రజలకు అవసరమైన సేవలను గ్రామ సచివాలయం ద్వారా పారదర్శకంగా అందించాలని డీఎల్డీవో ఉదయశ్రీ తెలిపారు. ఎం.బెన్నవరం సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేసింది. రికార్డులను పరిశీలించి సచివాలయం ద్వారా అందించిన సేవలపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో కులగణన సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించా రు. దీన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట సెక్రటరీ శ్రీను, సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పరుగు పోటీలు


పరుగులు తీస్తున్న ఎడ్ల బండి

రావికమతం: కొత్తకోటలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. మంగళవారం ఇక్కడ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తీర్థ మహోత్సవం సందర్భంగా సాయంత్రం నిర్వహించిన ఈ పోటీల్లో పలు గ్రామాల నుంచి 16 బళ్లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా చుక్కపల్లి ఎడ్లబండి నిలిచింది. తర్వాత స్థానాల్లో ఎం.కోటపాడు, కూండ్రం, సింహాద్రిపురం గ్రామాలకు చెందిన బండ్లు నిలిచాయి. వీటికి రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.4 వేల చొప్పున బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వాటికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహమందించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలి


ఆశ వర్కర్లకు సూచనలిస్తున్న డాక్టర్ నీరజ

అనకాపల్లి : గర్భిణులపై ఆశ వర్కర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నర్సింగరావుపేట యూపీహెచ్‌సీ వైద్యురాలు నీరజ అన్నారు. స్థానిక వైద్యాలయ ఆవరణలో మంగళవారం ఆశ వర్కర్స్ డే వేడుకలు ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. 1 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీల్లో రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. 6-19 సంవత్సరాల పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. ఈనెల 9వ తేదీన నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.